కొల్లేరు గ్రామాల్లో కాంక్రీట్ రహదారులు

- రూర్బన్ నిధులు రూ.2.91 కోట్లతో అభివృద్ధి పనులు
- 28న టెండర్ల ప్రక్రియ చేపట్టనున్న అధికారులు



కొక్కిరాయిలంకలో రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, వైసీపీ నాయకులు

ఏలూరు రూరల్ : రూర్బన్ పథకం ద్వారా ఏలూరు మండలం, దెందులూరు నియోజకవర్గంలోని 15 గ్రామాలకు కొత్త కళ రానుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.2.91 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో అధికారులు గ్రామాల్లో మారుమూల ప్రాంతాలకు సైతం సీసీరోడ్లు వేయనున్నారు. ఇందుకోసం ఈ నెల 28న ఆన్‌లైన్ విధానంలో టెండర్లు పిలవనున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు పనులు వేగవంతం చేస్తారు.

ఐదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ పథకాన్ని టీడీపీ నాయకులు అటకెక్కించారు. నాటి ప్రభుత్వం, పచ్చనేతలు పట్టించుకోలేదు. ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైన 7 గ్రామాల్లో ఈ పనులు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. నేడు రూర్బన్ పథకం అధికారులు కొల్లేరు గ్రామాల్లో చేపడుతున్నారు. చాటపర్రు, మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి, మల్కాపురంతో పాటు కొల్లేరు గ్రామాల్లో రూ-అర్బన్ పథకం అమలు కానుంది. అసంపూర్తిగా నిలిచిన ప్రభుత్వ పథకాలను పూర్తి చేయడమే పథకం ముఖ్య ఉద్దేశం. అందువల్లనే కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ గ్యాప్ ఫండ్ (సీజీఎఫ్) పేరుతో ఈ నిధులు విడుదల చేస్తోంది. ఈ మొత్తం నిధుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 70.30 నిష్పత్తి ప్రకారం నిధులు సమకూర్చాయి. నేడు ఈ నిధులన్నీ సీసీ రోడ్ల అభివృద్ధికి కేటాయించారు.

పనుల నిర్ధారణ

ఇప్పటికే అధికారులు గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులను నిర్ధారించారు. ఇందులో గుడివాకలంక, మొండికోడు, చాటపర్రు, జాతీపూడి, ప్రత్తికోళ్లలంక, కోటేశ్వరదుర్గాపురం, పైడిచింతపాడు, మాదేపల్లిలో 35 రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని గుర్తించారు. ఇవన్నీ బడుగు, బలహీన వర్గాల ప్రజలు అధికంగా నివసిస్తున్న ప్రాంతాలు. అయితే ఇప్పటికే ఈ గ్రామాల్లో కొన్ని రోడ్లు అభివృద్ధి కావడం వల్ల, వీటి స్థానంలో మరికొన్ని రోడ్లు జత చేయాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మౌలిక వసతులు మెరుగవుతాయి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచనలతో 15 గ్రామాల్లో రూర్బన్ నిధులతో సీసీ రోడ్డు పనులు అధికారులు చేపట్టనున్నారు. ఈ పనుల వల్ల గ్రామాల్లో బురదమయమైన రోడ్లు అభివృద్ధి బాట పడతాయి. దీనివల్ల పేదలకు రవాణ సౌకర్యంతో పాటు వాహనచోదకులు, పాదచారుల రాకపోకలు సులువు అవుతాయి. దెందులూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో అర్బన్ వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కొఠారు కృషి చేస్తున్నారు.

– పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

ఎన్నడూ లేని అభివృద్ధి



గతంలో ఎన్నడూ కొల్లేరు గ్రామాల్లో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాల్లేవు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రత్యేక శ్రద్ధ వహించి నిధులు మంజూరు చేశారు. అందువల్లనే అధికారులు తాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్లు, రోడ్లు మౌలిక వసతుల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కొల్లేరు గ్రామాల్లో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది.

– ముంగర సంజీవ్‌కుమార్, పైడిచింతపాడు

క్లుప్తంగా

152 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పేరయ్యకోనేరు ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రవైద్యశాలకు చెందిన వైద్యులు 152 మందికి పరీక్షలు నిర్వహించారు. 16 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారికి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మరో 36 మందికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులుచ కేవీ కిషోర్, బొలిశెట్టి సురేష్, అల్లం వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్లు కొనసాగించాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్ల నిలుపుదలను నిరసిస్తూ ఉద్యోగులు ఈనెల 21న ఏలూరు పాత బస్టాండ్‌సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీ, కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు పాల్గొనాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు రద్దు దిశగా మీడియం లెవెల్ ఆఫీసర్స్ (ఎంఎల్‌ఓ) కమిటీ ఇచ్చిన రిపోర్టును ఆమోదించడం వల్ల ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు రద్దయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత రాజ్యాంగబద్ధమైన జీవో- 26 ప్రపకారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కొనసాగించాలని, రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు.

మానవత భవన నిర్మాణానికి రూ.1,01,116 విరాళం

పెదపాడు: అప్పనవీడులోని మానవత భవన నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. విశ్రాంత ఎస్సై బాణాల నర్సింహరావు, సత్యవతి దంపతులు రూ.1,01,116, రెడ్డి వీర రాఘవరావు రూ.3,100 సంబంధిత నగదును మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా అధ్యక్షుడు సుభాచారికి దాతలు అందించారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా కొల్లేరు ప్రజలు



గుడివాకలంక వార్డు సభ్యుడిగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అయ్యప్పమణిరాజు

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ హవా కొనసాగుతోంది. గత ఎన్నికల మాదిరిగానే పంచాయతీ ఉప ఎన్నికల్లో సైతం కొల్లేరు గ్రామ ప్రజలు వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థికి విజయం కట్టబెట్టారు. ఏలూరు మండలం గ్రామాల్లో ఆగస్టు 14న పంచాయతీ ఉప ఎన్నికలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఎన్నికల అధికారులు కలకుర్రు, గుడివాకలంక పంచాయతీల్లో రెండు వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసి ఏర్పాట్లు చేశారు. గుడివాకలంకలో నిర్వహించిన ఎన్నికలలో 8 వార్డు సభ్యుడుగా వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి సైదు అయ్యప్పమణిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. గ్రామస్తులు ఎవ్వరూ టీడీపీ తరపున నామినేషన్ వేయలేదు. కలకుర్రు పంచాయతీ 8 వార్డు ఎస్సీలకు కేటాయించినా ఆ వర్గానికి చెందిన వారు గ్రామంలో నివసించకపోవడం వల్ల, ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఫలితంగా ఈ గ్రామంలో రెండోసారి సైతం వార్డు సభ్యుడు ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది.

యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా బలపడాలి



సమావేశంలో వివరాలను తెలుపుతున్న యాదవ యువ సమితి నాయకులు

ఏలూరు (టూటౌన్): యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా బలపడాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యాదవ యువ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కాట్రు కాట్రు బాలకృష్ణ కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యాదవ యువ సమితి జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక నరసింహారావుపేటలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశం అనంతరం నిర్వహించిన సమావేశంలో బాలకృష్ణ వివరాలను వెల్లడించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని యాదవుల అభివృద్ధి సంక్షేమం కోసం యాదవ యువ సమితి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమలో ఒక ఎంపీ స్థానాన్ని, ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున ఎమ్మెల్యే సీటును యాదవులకు కేటాయించాలని రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం యాదవ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి నిరుద్యోగ యువతకు రూ.2 లక్షల సబ్సిడీపై రూ.5 లక్షలు, రూ.10 లక్షలు రుణాలు అందించాలని కోరారు. యాదవ యువ సమితి నాయకులు పెనుబోయిన మహేష్, పొన్నుబోయిన సురేష్, కొలుసు శివరాజ్ మాట్లాడుతూ యాదవులు ఐకమత్యంగా ముందుకు సాగాలని అన్నారు. యాదవ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి యాదవ యువత ఉపాధికి బాటలు వేయాలని కోరారు. ఈ సమావేశంలో యాదవ యువ సమితి నాయకులు రాటాలు రాజు, చిమట గోపి యాదవ్, నవుళ్ళ నాగరాజు, మానికల నాగేంద్ర, బుగ్గల సతీష్, మురళీ యాదవ్, వివిధ మండలాలకు చెందిన కన్వీనర్లు, కో-కన్వీనర్లు పాల్గొన్నారు.

యువత ఐకమత్యంతో అన్ని రంగాల్లో రాణించాలి



బోయిన చంద్రశేఖర్, నాయకులను సత్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా యాదవ యువజన సంఘం అధ్యక్షుడిగా కైకలూరు మండలం భుజబల పట్నంకు చెందిన బోయిన చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఏలూరులోని యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఏలూరు నగర యాదవ యువజన సంఘం అధ్యక్షుడిగా ఏలూరు తూర్పు వీధికి చెందిన గొరిపర్తి విజయ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పెద్దల సహకారంతో జిల్లా యాదవ యువజన సంఘాన్ని ముందుకు తీసుకెళతానన్నారు. ముఖ్యంగా యువత విద్య, ఉపాధి, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. ఐకమత్యంతో కలిసి యాదవులు సంక్షేమానికి పాటు పడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాల కృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, జిల్లా కోశాధికారి గొర్ల రామారావు, ఏలూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల గంగాధర్, నగర అధ్యక్షుడు బొట్టా అజయ్, జిల్లా గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు ఆగొల్లు కృష్ణారావు, ఉపాధ్యక్షుడు దాసరి గోవిందరావు, కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, మాజీ అధ్యక్షుడు పచ్చిగోళ్ళ రామకృష్ణ, గురజాల రవి, ప్రధాన కార్యదర్శి బర్ల నరసింహా రాజు, నూజివీడు నగర యాదవ సంఘం అధ్యక్షుడు కొలుసు రవికుమార్, రాష్ట్ర యువజన సంఘం నాయకులు మల్లిపూడి రాజు పాల్గొన్నారు.

24న ఢిల్లీలో అఖిల భారత రైతు సదస్సు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 24న ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సదస్సుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నుంచి ఏలూరు జిల్లా ప్రతినిధిగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హాజరు కానున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన తెలియజేసారు. ఈ నెల 24న ఢిల్లీలోని టల్కటోర స్టేడియంలో అఖిల భారత రైతు సదస్సు జరుగుతుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా మరో దశ రైతు ఉద్యమం చేపట్టేందుకు ఈ సదస్సులో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు నుండి వ్యవసాయాన్ని మినహాయించాలని శ్రీనివాస్ కోరారు.

వైభవంగా కోట్లమ్మ జాతర

ఉంగుటూరు: నారాయణపురం గ్రామ దేవత కోట్లమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు ఆదివారం పాల్గొన్నారు. గ్రామంలోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాసుబాబుకు ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు వాసు బాబు స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మరడ మంగరావు, ఉపసర్పంచి అడపా శ్రీను, పాతూరి శ్రీనివాసరావు, గోలి రామారావు, ఎంపీటీసీ సభ్యులు బండారు నాగరాజు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ సంగీత్ మాధుర్‌కు సత్కారం



డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన సంగీత్ మాధుర్‌ను సత్కరిస్తున్న కాపు సంక్షేమ సేన నాయకులు

ఏలూరు (టూటౌన్): డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన కానాల సంగీత్ మాధుర్‌ను కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కాపు సంక్షేమసేన జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు మాట్లాడుతూ పరీక్షలు రాసిన 86 వేల మందిలో కేవలం 13 మంది డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికయ్యారని వారిలో ఏలూరుకు చెందిన మాధుర్ ఒకరు కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రతిభావంతులైన వారిని ప్రోత్సహిస్తున్న కాపు సంక్షేమ సేన మాధుర్‌కు ప్రతిభా పురస్కారాన్ని, రజత పతకాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు వాసా రాజు, ప్రముఖ వాణిజ్య వేత్తలు నారా శేషు, యాళ్ళబండి శ్రీరామ్, చెరకుతోట రాము, కాపు సంక్షేమ సేన నాయకులు తన్నీరు బుజ్జి, గాదిరాం బాబు, బాడిత నారాయణరావు, సోడిశెట్టి శాంతకుమార్, తోట వరప్రసాద్, వీరంరెడ్డి రమేష్, లింగిశెట్టి శశికుమార్, బర్మా లక్ష్మణరావు, కొప్పిశెట్టి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



కోలాట, భజన గురువుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గారపాటి చౌదరి

ఏలూరు (టూటౌన్): ఏలూరులో వేలాది మందితో దేశ సంస్కృతి సంప్రదాయంలో భాగమైన కోలాటం, భజన బృందాలతో ఒక భారీ కార్యక్రమాన్ని తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి చెప్పారు. స్థానిక కోటదిబ్బలోని నేరెళ్ళ కల్యాణ మండపంలో కోలాట, భజన గురువుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గారపాటి చౌదరి మాట్లాడుతూ అంతరించిపోయే కళ కోలాటం కాదని మనుషుల మధ్య అంతరాన్ని తగ్గించే గొప్ప కళ కోలాటమన్నారు. దేవాలయ కేంద్రంగా నిర్వహించే కోలాటం వల్ల మనుషుల మధ్య దూరం తగ్గుతుందన్నారు. కోలాట బృందాలు, భజన బృందాలు ఒకే వేదికపైకి తీసుకువచ్చి భారీ కార్యక్రమాన్ని నిర్వహించాలనే సంకల్పంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. తపన ఫౌండేషన్ సహకారంతో ఈకార్యక్రమాన్ని నిర్వహించేందుకు కోలాట గురువులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ముండూరు క్షేత్రం యజ్ఞవల్క్య రాజాశ్రమం స్వామీజీ కృష్ణ చరణానంద భారతి మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాన్ని పరిరక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోలాటం నేర్పే గురువులు, వివిధ భజన బృందాల గురువులు, కళాకారులు పాల్గొన్నారు.

108 డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్నేషనల్ మెడికల్ ట్రాన్స్‌పోర్ట్ డే సందర్భంగా ఏలూరు స్మార్ట్ ప్రొఫెషనల్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కోవిడ్ సమయంలో రోగులకు ప్రాణాలకు తెగించి సేవలు చేసిన 108 డ్రైవర్ రాజారావు కోవిడ్‌లోనే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు రాజారావు కుటుంబానికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం స్థానిక ఇండోర్ స్టేడియం నుంచి పాత బస్టాండు వరకూ 104,108,తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ అంబులెన్స్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, క్లబ్ జోన్ చైర్మన్ బూసి సురేంద్ర, గ్లోబల్ సర్వీస్ కో-ఆర్డినేటర్ వెల్లంకి సత్య స్వరూప్, ఎస్వీ సురేష్ కుమార్, షేక్ సమీర్, అడపా శ్రీనివాసరావు, వీజీఎంవీ ఆర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

పెదవేగి : రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్లపై రూ.36,490 విరాళంపై రూ.38,664, లడ్డూ ప్రసాదంపై రూ.34,800, ఫోటోల విక్రయంతో రూ.4,535, మొత్తం రూ.1,14,489 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు చెప్పారు.

నిధుల దుర్వినియోగంపై న్యాయం చేయాలి

దెందులూరు: స్థానిక పంచాయతీలో నిధుల దుర్వినియోగం విచారణపై రెండు నెలలు గడుస్తున్నా జిల్లా అధికారులు న్యాయం చేయకపోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. ఆదివారం దెందులూరు డాక్టర్ వైఎస్సార్ జగనన్న బస్టాండ్ సెంటరులో వైఎస్సార్ విగ్రహం వద్ద ఏసుబాబు, దెందులూరు ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, ఎంపీటీసీలు పులిపాటి ఆనంద్, తోట విజయకుమారి అజిత్, విద్యావిభాగం దెందులూరు మండల అధ్యక్షుడు వన్నెకూటి సుందరం, వైఎస్సార్ సీపీ నాయకులు వన్నెకూటి రాజు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు నిధుల దుర్వినియోగానికి సంబంధించి రికార్డులు సీజ్ చేసి తీసుకువెళ్లి రెండు నెలలు కావస్తున్నా నిందితులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజల ధనం ప్రైవేటు వ్యక్తుల బ్యాంకు అకౌంట్లలోకి వెళ్లిందని, పన్నులు ట్రెజరీకి పూర్తి స్థాయిలో జమ చేయలేదని, దీనిపై రికార్డులు లేవని జిల్లా అధికారులే చెబుతున్నారని వారన్నారు. పంచాయతీలో రికార్డుల సీజ్, ఇతర అంశాలపై ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి వివరించామని వారు తెలిపారు.

ఆపదలో ఆపన్న హస్తం.. సీఎం సహాయ నిధి



సీఎం సహాయనిధి ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, నాయకులు

పెదవేగి : అరుదైన ఆరోగ్య సమస్యతో వైద్యానికి స్తోమత లేక అతలాకుతలం అవుతున్న ఓ కుటుంబాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అపన్నహస్తం అందించి ఆదుకున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నానని, సాయం చేసి ఆదుకోవాలని పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన గురజా కనకదుర్గారావు స్థానిక నాయకులతో కలిసి ఇటీవల ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి విన్నవించారు. సమస్య తీవ్రత తెలుసుకున్న వెంటనే సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్లో గురజా కనకదుర్గారావు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స, వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఆదివారం కొండలరావుపాలెం క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు సంబంధిత పత్రాలను అందజేశారు. తక్షణం స్పందించి ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి కనకదుర్గారావు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు, విజయరాయి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌తో తక్షణమే సమస్యల పరిష్కారం

పెదవేగి : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ ఏర్పాటుచేసి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	50-84
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	36
పచ్చిమిర్చి	56-60	బీట్‌రూట్	32
కాకర కాయలు	50-60	కీరా దోస	40
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	48	అల్లం	120-220
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	32	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	30 - 46	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	20

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	14
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	31